క్లుప్తంగా

28న అమ్మవారి చీరల వేలం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక పత్తేబాద నాలుగు గుడుల సెంటర్‌లోని కనకదుర్గమ్మవారి ఆలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలను ఈ నెల 28న వేలం వేయనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి డి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి వేలం ప్రక్రియ దేవదాయ శాఖ అధికారుల సమక్షంలో నిర్వహిస్తామని, ఆసక్తి ఉన్న వారు వేలంలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక ఒన్‌టౌన్‌లోని వెంకన్న చెరువు సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం ఈ నెల 25న శుక్రవారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం సెంటర్, 7 కాల్వల సెంటర్, చాటపర్రు రోడ్, తూర్పు వీధి సాయి బాబా గుడి సెంటర్, తూర్పు వీధి గంగానమ్మ గుడి ఏరియా, ఫిల్ హౌస్ పేట, వీవర్స్ కాలనీ, అరుంధతి పేట, పడమర వీధి, దొంగల మండపం ఏరియా, కండకం రోడ్డు, తూర్పువీధి, శనగపప్పు బజార్ పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఎంపీడీఓను కలిసిన గుడివాకలంక పెద్దలు

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలం గుడివాకలంక పెద్దలు బుధవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీఓ వి.శ్రీలతను కలిశారు. గ్రామానికి చెందిన ఘంటసాల నాగరాజు, నేపాల జగపతిబాబు, కాత్యాయని, ఘంట శ్రీను, బలే వెంకటేశ్వరరావుతో పాటు గుమస్తా బాలాజీ ఎంపీడీఓకు పుష్పగుచ్ఛం అందజేశారు.

29న హిందూ ధర్మ రక్షా సమితి సమావేశం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): హిందూ ధర్మ రక్షా సమితి ఏలూరు నగర, గ్రామ ముఖ్య కార్యకర్తల, కమిటీల సమావేశం ఈ నెల 29వ తేదీ మంగళవారం మధ్యాహ్నం మూడు నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు స్థానిక వైఎంహెచ్ఏ హాలులో నిర్వహించనున్నట్టు సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ సుబ్రహ్మణ్యం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రత్యేక ఆహ్వానితులుగా కన్యాకుమారిలోని వివేకానంద కేంద్రం ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల పబ్లిక్ రిలేషన్ ఇన్‌చార్జి సీవీ సదాశివ, హిందూ ధర్మరక్షా సమితి రాష్ట్ర లీగల్ అడ్వైజర్ చేదులూరి శివ కేశవ్ పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యకర్తలంతా నుదుటన బొట్టు ధరించాలని సూచించారు. హిందువుల సంఘటితం కావడం కోసం, ఐక్యత కోసం, రాజకీయాల్లో ఎలా ప్రవర్తించాలి, ఎవరికి మద్దతుగా నిలబడాలి, అలాగే లవ్ జిహాదీ, మతమార్పిడులు, చర్చిల అక్రమ నిర్మాణాలు, హిందూ ఆలయాల భూముల అన్యాక్రాంతం, హిందూ ధర్మ రక్ష సమితి పటిష్టత వంటి అంశాలపై చర్చించనున్నట్టు వివరించారు.

ఇంటింటికీ గ్యాస్ పైప్‌లైన్‌తో మేలు

- ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు వద్దు
- ఏలూరు నగరంలో 75 వేల కుటుంబాలకు లబ్ధి

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం వచ్చే దీపావళి నుంచి తెలుపు రంగు రేషన్ కార్డు ఉన్న కుటుంబాలకు ఏటా మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని చెబుతోంది. దీంతో తెలుపు రంగు రేషన్ కార్డులేని వారికి, మధ్యతరగతి ప్రజలు, ప్రైవేటు ఉద్యోగులు, ఆదాయ పన్ను చెల్లించే వర్గాల పరిస్థితి ఏమిటనే ప్రశ్న తలెత్తుతోంది. మూడు నెలల వంట గ్యాస్ సిలిండర్ల సొమ్ముతో సంవత్సరం అంతా పైప్‌లైన్ ద్వారా గ్యాస్ పొందవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో ఏలూరు నగరంలో 75 వేల కుటుంబాలకు ఉపయోగపడే విధంగా ఇంటింటికీ పైప్‌లైన్ ద్వారా గెయిల్ వంట గ్యాస్ సరఫరా పథకం అమలు చేయాలని నగర ప్రజలు ముక్త కంఠంతో కోరుతున్నారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వ హయాంలో కేంద్రంపైనా, ఓఎన్‌జీసీ పైనా పైప్‌లైన్ ద్వారా కేజీ బేసిన్ పరిధిలో గ్యాస్ సరఫరా చేయాలంటూ ఒత్తిడి తెచ్చిన విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

2005లోనే ప్రణాళికలు

కేజీ బేసిన్ పరిధిలోని పూర్వపు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని ప్రతి ఇంటికీ గెయిల్ పైప్‌లైన్ ద్వారా వంట గ్యాస్ సరఫరా చేయాలనే సంకల్పంతో 2005లో నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రణాళికలు రూపొందించారు. 2020 నాటికి అందరికీ అందజేస్తామని చెప్పారు. దీని కోసం నాటి వైఎస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపైనా, ఓఎన్‌జీసీ పైనా తీవ్ర ఒత్తిడి తెచ్చింది. అయితే వివిధ కారణాలతో ఈ పథకం ముందుకు సాగలేదు. కేజీ బేసిన్ గ్యాస్‌ను ఈ ప్రాంత ప్రజల అవసరాలకు వినియోగిస్తే ప్రజలకు 70 నుంచి 80 శాతం ధరలు తగ్గుతాయి. నెలకు కేవలం రూ.200 చెల్లిస్తే నెలంతా వంట గ్యాస్ సరఫరా అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు.



గెయిల్ గ్యాస్ పైప్‌లైన్ (ఫైల్)



గెయిల్ గ్యాస్ పైప్‌లైన్ స్టోరేజీ పాయింట్

ఉచితానికి, పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరాకు వ్యత్యాసం ఇలా

నలుగురున్న కుటుంబానికి ఏడాదికి 12 బండలకు ఖర్చు	రూ.10,800
పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరాకు నెలకు రూ.200 చొప్పున	రూ. 2,400
వ్యత్యాసం	రూ.8,400
మూడు సిలిండర్లు ఉచితంగా ఇస్తే తగ్గే వ్యయం	రూ.2,700
వినియోగదారులకు మిగిలే ఆదాయం	రూ.5,700

90 శాతం గ్యాస్ గుజరాత్, రిలయన్స్‌లకు తరలింపు

కేజీ బేసిన్ గ్యాస్‌ను రాష్ట్ర ప్రజల అవసరాలు తీరాకే ఇతర రాష్ట్రాలకు ఇవ్వాలని నాటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని, ఓఎన్‌జీసిని అప్పట్లో డిమాండ్ చేశారు. రాష్ట్ర అవసరాల కోసం ప్రణాళికలు తయారు చేశారు. కానీ ఆయన ఆకస్మిక మరణం వల్ల అది అమలులోకి రాలేదు. మరో వైపు కేజీ బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న గ్యాస్‌లో 90 శాతం గుజరాత్, రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు తరలిపోతుంది. ఈ క్రమంలో మన కేజీ బేసిన్ గ్యాస్ మనకే కావాలని ఆందోళన చేయాల్సి ఉంది. అదే జరిగితే నెలకు రూ.200కే ప్రతి కుటుంబానికి సరిపడే వంట గ్యాస్ లభించనుంది.

రూ.43 కోట్లు ఆదా

ఏలూరు నగరంలో 75 వేల కుటుంబాలు వంట గ్యాస్‌ను వినియోగిస్తున్నారు. వీరికి గెయిల్ పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా చేస్తే ఏడాదికి రూ.8400 తగ్గనుంది. దీనివల్ల ఏడాదికి రూ.43 కోట్లు అదనపు ప్రయోజనం చేకూరనుంది. చంద్రబాబు ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తే దానివల్ల రూ.2700 చొప్పున ఏడాదికి దాదాపు రూ.20 కోట్లు మాత్రమే లబ్ధి చేకూరనుంది.

గెయిల్ గ్యాస్ సాధనకు ఉద్యమించాలి



ఏలూరు నగరంలో ప్రతి ఇంటికీ గెయిల్ పైప్‌లైన్ ద్వారా వంట గ్యాస్ సరఫరాకు ఉద్యమించాలి. దీనికి పాలకులపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉంది. చంద్రబాబు ఉచిత మూడు సిలిండర్లు వద్దు గెయిల్ పైప్‌లైన్ ద్వారా గ్యాస్ సరఫరా ముద్దు అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఉంది. – బి.సోమయ్య, సీఐటీయూ, జిల్లా ఉపాధ్యక్షుడు, ఏలూరు

గెయిల్ గ్యాస్‌తోనే ప్రయోజనం



గెయిల్ పైప్‌లైన్ ద్వారా ఇంటింటికీ వంట గ్యాస్ సరఫరా చేసే పథకంతో ప్రజలకు ఎంతో ప్రయోజనం ఉంది. ఏలూరుకు సమీపంలో ఉన్న అవనిగడ్డలో మాదిరిగా ఇంటింటికీ వంట గ్యాస్‌ను పైప్‌లైన్ ద్వారా అందించాలి. ఆ దిశగా ప్రభుత్వాలు కృషి చేయాలి. మహిళా లోకం ఉద్యమించాలి. – ఎ.శ్యామల రాణి,జిల్లా కార్యదర్శి,ఐద్వా ఏలూరు జిల్లా

నేడు ఏలూరు జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సమావేశం

సమస్యల పరిష్కారం ఉంటుందా ?

ఏలూరు టౌన్: ఏలూరు సర్వజన ఆసుపత్రి అనేక సమస్యలు, అవినీతి ఆరోపణలు, గందరగోళ పరిస్థితులతో సతమతమవుతోంది. ఈ నేపథ్యంలో గురువారం జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సమావేశం కలెక్టర్ వెట్రి సెల్వి అధ్యక్షతన నిర్వహించనున్నారు. సమస్యల పరిష్కారానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారనే దానిపై సర్వత్రా చర్చ సాగుతోంది. ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుబంధంగా బోధనాసుపత్రిగా అభివృద్ధి చెందాల్సిన తరుణంలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉండగా, కొన్ని పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి. జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి నిత్యం మెడికో లీగల్ కేసులు అధికంగా వస్తుంటాయి. ఎమ్మెల్సీ కేసులు రిజిస్టర్‌లో నమోదుకే సమయం సరిపోతుందని, రోగులకు చికిత్స ఎప్పుడు చేయాలో అర్థం కావటం లేదని వైద్యులు వాపోతున్నారు. బెడ్లు సరిపోక విజయవాడ, గుంటూరుకు రిఫర్ చేయాల్సి దుస్థితి నెలకొంది. జీజీహెచ్ ప్రాంగణంలోని క్యాంటీన్, మోడల్ డెయిరీ, ఫ్యాన్సీ షాపు, సైకిల్ స్టాండ్‌లకు టెండర్ పిలిచి వేలం నిర్వహించాల్సి ఉండగా.. కరోనా నుంచి ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. ఈ దుకాణాలు నిర్వహించిన యజమానులు నుంచి భారీగా బకాయిల వసూలు చేయటంలో అధికారులు విఫలమయ్యారనే అపవాదు ఉంది. రోగుల సహాయకులకు కనీసం భోజనం చేసేందుకు సరైన సౌకర్యం లేదు. గతంలో దాతల సహకారంతో రూ.15 లక్షలతో ఒక షెడ్డు నిర్మించగా, ప్రస్తుతం మెడికల్ కాలేజీ కోసం వినియోగించటంతో సహాయకులకు నిలువనీడ కరువైంది. జీజీహెచ్ మార్చురీలో అనాథ శవాల వ్యాపారంపైనా దృష్టి సారించి పూర్తిస్థాయి దర్యాప్తుకు ఆదేశించాలని పలువురు కోరుతున్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



గంగరాజు మృతదేహం

పెదవేగి : ప్రమాదవశాత్తు చెరువులో పడి ఓ వృద్ధుడు మరణించాడు. ఎస్సై కె రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం పెదవేగి మండలం న్యాయంపల్లి గ్రామానికి చెందిన సీహెచ్ గంగరాజు(75) బుధవారం ఉదయం వాకింగ్‌కు వెళ్లాడు. మధ్యాహ్నం న్యాయంపల్లి సచివాలయం పక్కన ఉన్న లింగంకుంట చెరువులో అతని మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. గంగరాజు కుమారుడు చిన్న నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి చనిపోయి ఉండవచ్చునని చిన్న నాగరాజు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

ఈ–చలానాల రద్దు కోరుతూ మంత్రికి వినతి

ఏలూరు (టూటౌన్): ఆటోలు, టాక్సీలపై ఈ–చలానాలను రద్దు చేయాలని కోరుతూ రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి విజయవాడలోని ఆయన క్యాంప్ ఆఫీసులో బుధవారం ఉదయం సీఐటీయూ నాయకులు చక్రాల అమర్ కుమార్, జె.గోపి, బి.చంద్రశేఖర్ వినతి పత్రం అందజేశారు. ఏలూరు నగరంలో స్టాప్ లైన్ వైలేషన్ పేరుతో విధిస్తున్న ఈ–చలానాలను రద్దు చేయాలని స్టాప్ లైన్, జీబ్రాలైన్, సీసీ కెమెరాలను క్రమబద్ధీకరించాలని కోరారు. ఆటోలు, టాక్సీలపై రూ.300 నుంచి రూ.30 వేల వరకు విధించడం వల్ల డ్రైవర్లు తీవ్ర ఆందోళన గురవుతున్నారని తెలిపారు. నారా లోకేష్ నిర్వహించిన పాదయాత్రలో రవాణా రంగ కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని, జీఓ నెంబర్ 21 రద్దు చేయాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్ శివాజీ, ముజఫర్ అహ్మద్ కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారని పేర్కొన్నారు.



మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి వినతి పత్రం అందిస్తున్న నాయకులు

బాలలను పనిలో పెట్టుకుంటే లైసెన్స్‌లు రద్దు

ఏలూరు (టూటౌన్): బాలలను పనిలో పెట్టుకుంటే సంబంధిత దుకాణాలు, హోటల్స్ లైసెన్స్ రద్దు చేయడంతో పాటు చట్ట ప్రకారం శిక్షిస్తామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ హెచ్చరించారు. రత్న ప్రసాద్ ఆధ్వర్యంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ నాగేశ్వరరావు డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.సూర్య చక్రవేణి, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ ఏలూరులోని హోటల్, మాల్స్ యజమానులకు, ఉద్యోగులకు బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. 18 సంవత్సరాల్లోపు బాలలను పనిలో చేర్చుకొంటే దుకాణాల లైసెన్సు రద్దు చేయడమే కాక చట్టప్రకారం శిక్షిస్తామన్నారు. బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1098 లేదా 15100కు సమాచారం అందించాలని కోరారు. డిసెంబర్ 14వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో లేబర్ ఆఫీస్, పోలీస్ డిపా సిబ్బంది పాల్గొన్నారు.



హోటల్స్, మాల్స్, దుకాణాల నిర్వాహకులకు అవగాహన కల్పిస్తున్న రత్నప్రసాద్

గోదావరి జలాలను అందించాలి

ఏలూరు (టూటౌన్): వెంకటాపురం ప్రాంత ప్రజలకు గోదావరి జలాలను తాగునీరుగా అందించాలని సీపీఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ కోరారు. స్థానిక మాదేపల్లి కాలనీలో గనిగంటి కోటేశ్వరరావు అధ్యక్షతన ఏలూరు 1 టౌన్, సీపీఎం శాఖా మహాసభ బుధవారం నిర్వహించారు. వెంకటాపురంలో రోడ్లు, డ్రైయిన్లు అభివృద్ధి చేయాలని, పందులు, దోమల బెడదని అరికట్టాలని, మొండిల కాలనీలో లో వోల్టేజ్ సమస్య పరిష్కరించాలని, ప్రత్యేక ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని, వాటర్ హెడ్ ట్యాంక్ నిర్మించాలని, ఇందిరమ్మ, జగనన్న కాలనీల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని తీర్మానించారు. శాఖ కార్యదర్శి తాడిపూడి రాజు, ఎల్ సత్యనారాయణ తదితరులు మాట్లాడారు.

21 నుంచి సాగునీటి సంఘాల ఎన్నికలు

దెందులూరు: నవంబర్ 21 నుంచి 23 వరకు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో సాగునీటి సంఘాల ఎన్నికలు నిర్వహించనున్నట్టు మైనర్ ఇరిగేషన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గనిరాజు బుధవారం తెలిపారు. ఇప్పటికే అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో నీటి సంఘాల ఎన్నికలకు ఓటు వేసే ఓటర్ల రైతుల జాబితా సిద్ధం చేశారన్నారు.

మినీ లైబ్రరీ ఏర్పాటు చేయాలి

దెందులూరు: మండలంలో రామారావుగూడెం గ్రామంలో మినీ లైబ్రరీ ఏర్పాటు చేయాలని 10 గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అప్పారావు పాలెం, శ్రీరామవరం, మేధినరావుపాలెం, కంద్రికనర్సింహపురం, చల్లచింతలపూడి, ధర్మారావుపేట, పెరుగ్గూడెం, గాలాయగూడెం, గంగన్నగూడెం, జోగన్నపాలెం గ్రామాలకు రామారావుగూడెంలో మినీ గ్రంథాలయం ఏర్పాటు చేస్తే ప్రజలందరికీ అనువుగా ఉంటుందని చెబుతున్నారు. గోపన్నపాలెంలో గ్రంథాలయాన్ని ఇప్పటికే మూసివేశారని తెలిపారు.

గడ్డి మందు తాగి ఆత్మహత్య

భీమడోలు: మద్యానికి బానిసైన ఓ రోగి గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంబర్‌పేట పంచాయతీ పరిధిలోని పాత అంబర్‌పేటకు చెందిన గాలి మహంకాళీరావు (50) ఏడాది క్రితం పక్షవాతానికి గురై వైద్యం చేయించుకుంటున్నాడు. ఆతను మద్యానికి బానిసై తీవ్ర మనోవేదనతో ఈనెల 21న గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో ఉన్న ఆతన్ని కుటుంబ సభ్యులు వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య గాలి సిరివేణి ఫిర్యాదు మేరకు భీమడోలు ఎస్సై వై.సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

6న ఫిషర్‌మెన్ సొసైటీలకు ఎన్నికలు

దెందులూరు: మండలంలో నాలుగు గ్రామాల్లో నాలుగు ఫిషర్‌మెన్ సొసైటీలకు నవంబరు 6న ఎన్నికలు నిర్వహించనున్నట్టు మత్స్యశాఖ దెందులూరు మండల ఇన్‌చార్జి సతీష్ అన్నారు. ఒక్కో సొసైటీకి 6, 7, 11 మంది సొసైటీ బైలాకు అనుగుణంగా సభ్యులు ఉంటారని, వారి నుంచి ఒకరిని ప్రెసిడెంట్, మరొకరిని వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నుకొంటామని తెలిపారు. ఈ ఎన్నికల నిర్వహణకు జిల్లా కలెక్టర్, నలుగురు ఉన్నతాధికారులను నియమించినట్టు చెప్పారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	33
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	37
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	21
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	32
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	29
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	30
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	22
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	30
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	29
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	37
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	32
ఏలూరు - తిరుపతి	16.00	4830	21

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	40-46	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	48	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	60	చామదుంపలు	48
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	07,10
బెండకాయలు	50	కంద	60
పచ్చిమిర్చి	40-48	బీట్‌రూట్	44-48
కాకర కాయలు	44	కీరా దోస	34
బీరకాయలు	44	ఫ్రెంచ్‌బీన్స్	00
బీరకాయలు (పందిరి)	58	అల్లం	80-150
క్యాబేజీ	32-36	కొత్తిమీర (కట్ట)	25
క్యారెట్	50-56	పాలకూర	12
దొండకాయలు	36-40	చుక్కకూర	12
బంగాళదుంపలు	40	తోటకూర	10
ఉల్లిపాయలు	38-56	గోంగూర	07
గోరుచిక్కుడు	40	పుదీనా	05
దోసకాయలు	36-48	బఠాణీ	--
అనబకాయ (1)	30-40	క్యాప్సికమ్	80-92
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	44

స్టేడియం.. ఆయాసం



ఎండలోనే విద్యార్థులు



ఎండలో నేలపైనే క్రీడాకారుల పడిగాపులు

ఏలూరు ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో విద్యార్థులకు జిల్లా స్థాయి గేమ్స్ సెలక్షన్స్ నిర్వహిస్తున్నారు. కబడ్డీ, హ్యాండ్ బాల్ తది తర ఆటల్లో విద్యార్థులు పోటీ పడుతున్నారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. విద్యార్థులు సేదదీరడానికి కనీసం చిన్న టెంట్, దాహం తీర్చుకునేందుకు మంచినీరు కూడా ఏర్పాటు చేయలేదు. బుధవారం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో విద్యార్థులు ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరయ్యారు. ఎండలోనే విద్యార్థులు నేలపైనే కూర్చొని ఆపసోపాలు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, ఏలూరు



ఎండకు పైటకొంగులు కప్పకున్న పీఈటీలు, క్రీడలు తిలకించేవారు



గ్రౌండ్‌లో కనిపించని టెంట్

విద్యుత్‌షాక్‌తో కూలీ మృతి

ఏలూరు టౌన్: విద్యుత్ షాక్‌తో తాపీ పనులు చేసుకునే కూలీ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివి. ఏలూరు వన్‌టౌన్ లంబాడిపేటకు చెందిన భూక్య రాఘవ (30) నగరంలో తాపీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రాఘవకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బుధవారం ఏలూరు వన్‌టౌన్‌లోని సత్యనారాయణపేటలో భవన నిర్మాణ పనులకు వెళ్లాడు. తాపీ పనులు చేస్తూ ఉండగా పైన ఉన్న విద్యుత్ తీగలు తగిలి విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తోటి కూలీలు అతడ్ని ఏలూరు సర్వజన ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై ఏలూరు వన్‌టౌన్ ఎస్సై మదీనా బాషా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతుడు భూక్యా రాఘవ

కొవ్వలిలో వ్యక్తి మృతి

దెందులూరు: కొవ్వలి గ్రామంలో ఓ వ్యక్తి బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మాదాసు సాయి అనే వ్యక్తి మూడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక బాబు ఉన్నాడు. ఇటీవల భార్యభర్తల మధ్య గొడవలతో భార్య హనుమాన్ జంక్షన్ పోలీస్ స్టేషన్‌లో సాయిపై కేసు పెట్టింది. మనస్థాపంతో సాయి ఉరివేసుకుని మృతి చెందాడు. మృతదేహాన్ని ఏలూరు వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేపట్టామని ఎస్సై శివాజీ తెలిపారు.